నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, శుక్రవారం 29 నవంబర్ 2024 | HYDERABAD

'ఓటీఎస్' అంతంతే..!

వచ్చింది.. రూ. 90కోట్లే..రెండ్రోజుల్లో గడువు ముగింపు

సిటీబ్యూరో: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న నీటి బిల్లుల బకాయిల చెల్లింపునకు ప్రభుత్వం ప్రకటించిన వన్ టైం సెటిల్‌మెంట్ (ఓటీఎస్) పథకం తుది గడువు సమీపిస్తున్నది. మరో రెండు రోజుల్లో (ఈ నెల 30వ తేదీ) గడువు పూర్తవుతుంది. వినియోగదారులు పెండింగ్‌లో ఉన్న అసలు మొత్తం కడితే ఎలాంటి వడ్డీ, ఆలస్య రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని, ఈ రెండు రోజులు ఓటీఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. కాగా, జలమండలి పరిధిలో 7,11030 మంది బకాయిదారులకు ఓటీఎస్ సద్వినియోగం చేసుకోవాల్సి ఉండగా, ఇప్పటి వరకు కేవలం లక్ష మంది మాత్రమే సద్వినియోగం చేసుకున్నారు. రూ. 1792 కోట్లు ఓటీఎస్ రూపంలో రావాల్సి ఉండగా, కేవలం రూ. 90కోట్లు మాత్రమే వచ్చింది. ఓటీఎస్‌ను సకాలంలో ప్రజల్లోకి తీసుకోలేకపోవడం, విధి విధానాల అమల్లో ఆలస్యం, అవగాహన లేమి తదితర కారణాలతో ఓటీఎస్ ఆదరణ కరువైందని చెబుతున్నారు.



మెట్రో రైల్ రెండో దశను విస్తరించాలని ఎండీ ఎన్వీఎస్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

కేసీఆర్ పోరాట స్ఫూర్తి మనందరికీ ఆదర్శం

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

బంజారాహిల్స్, నవంబర్ 28: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన ప్రాణాలను ఫణంగా పెట్టేందుకు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన ఉద్యమ సారథి, మాజీ సీఎం కేసీఆర్ పోరాట స్ఫూర్తి మనందరికి ఆదర్శమని, దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని హైదరాబాద్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కోరారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం బీఆర్ఎస్ దీక్షా దివస్ సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాలతో శుక్రవారం దీక్షా దివస్ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించనున్నామన్నారు. తెలంగాణ స్వప్నాన్ని సాకారం చేసిన మాజీ సీఎం కేసీఆర్.. రాష్ట్రాన్ని కూడా అభివృద్ధిలో దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిపారన్నారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించనున్న దీక్షా దివస్ కార్యక్రమానికి పెద్ద ఎత్తున కార్యకర్తలు, ఉద్యమకారులు తరలిరావాలని కోరారు. ర్యాలీగా తెలంగాణ భవన్‌కు వెళ్లాల్సి ఉంటుందని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కార్పొరేటర్లు, డివిజన్ బీఆర్ఎస్ నేతలు, ముఖ్య నాయకులు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు దేదీప్యరావు, రాజ్‌కుమార్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

మెట్రో రైల్ రెండో దశను విస్తరించాలి

మల్కాజిగిరి: మెట్రో రైల్ రెండో దశను విస్తరించాలని ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు బేగంపేటలోని మెట్రో రైల్ కార్యాలయంలో ఎండీ ఎన్వీఎస్ రెడ్డికి ఎమ్మెల్యే గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, మెట్రో రైల్ రెండో దశలో 105 కిలో మీటర్లు విస్తరించాలన్నారు. జేబీఎస్ నుంచి మేడ్చల్ 20 కిమీ, జేబీఎస్ నుంచి శామీర్‌పేట 22 కిమీ, ప్యారడైజ్ నుంచి కండ్లకోయ 22 కిమీ, బోయిన్‌పల్లి నుంచి గండి మైసమ్మ 21 కిమీ, తార్నాక నుంచి కీసర 20 కిలోమీటర్ల కనెక్టివిటీని ఏర్పాటు చేయాలన్నారు. మెట్రో రైల్‌ను విస్తరించడం ద్వారా నగరం మొత్తం సమతుల్యంగా అభివృద్ధి చెందడంతో పాటు ట్రాఫిక్ సమస్యలు తప్పుతాయన్నారు. రెండో దశ విస్తర్ణం కోసం సర్వే నిర్వహించి ప్రజలకు మెట్రో రైల్ రవాణా సౌకర్యం కల్పించాలన్నారు.



బిర్యానీలో బొద్దింక

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నం. 3లోని ఐసీఐసీఐ లాంబార్డ్ ఇన్సూరెన్స్ సంస్థకు చెందిన నితేశ్ రావుతో పాటు 12 మంది సిబ్బంది గురువారం రోడ్ నం. 3లోని బిర్యానీ వాలా రెస్టారెంట్‌కు వెళ్లి బిర్యానీ ఆర్డర్ చేశారు. వారికి సర్వ్ చేసిన బిర్యానీలో బొద్దింక కనిపించడంతో నితేశ్‌రావు తదితరులు హోటల్ సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లారు. ఏదో పొరపాటున బొద్దింక వచ్చింది.. అప్పుడుప్పుడు ఇలా వస్తుంటాయి.. లైట్ తీసుకోండి అంటూ హోటల్ సిబ్బంది చెప్పడంతో వాగ్వాదం చోటు చేసుకుంది. హోటల్ నిర్వాహకులను పిలిపించండి ఇదేం పద్ధతి అని ప్రశ్నించినా ఏమాత్రం పట్టించుకోకపోగా న్యూసెన్స్ చేస్తున్నారంటూ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. బంజారాహిల్స్ పోలీసులు ఇరు వర్గాలకు సర్దిచెప్పారు. ఈ వ్యవహారంపై బాధితులు జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ విభాగానికి ఫిర్యాదు చేశారు.

చరిత్ర మలుపు తిరిగిన రోజు

ఒక్కో నియోజకవర్గం నుంచి 2వేల మందితో బైక్ ర్యాలీ

బసవతారకం వైద్యశాల సర్కిల్ నుంచి పాదయాత్రగా తెలంగాణ భవన్‌కు..

పలు చోట్ల సేవా కార్యక్రమాలు

నిమ్స్‌లో 2వేల మంది రోగులకు పండ్ల పంపిణీ

నేడు దీక్షా దివస్

గ్రేటర్‌వ్యాప్తంగా శుక్రవారం దీక్షా దివస్‌ను ఘనంగా నిర్వహించేందుకు గ్రేటర్ బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధమయ్యారు. నియోజకవర్గాల వారీగా సేవా కార్యక్రమాలు చేపట్టనున్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు నిమ్స్ వైద్యశాలలో 2వేల మందికి పండ్లు పంపిణీ చేయనున్నారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు మాగంటి గోపీనాథ్, ఎమ్మెల్సీ మధుసూదనా చారి, దీక్షా దివస్ హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి పొన్నాల లక్ష్మయ్య, ఇతర ఎమ్మెల్యేలు పాల్గొని రోగులకు పండ్లు పంపిణీ చేయనున్నారు. అలాగే ఒక్కొక్క నియోజకవర్గం నుంచి 2వేల మంది తరలిరానుండగా, బైక్‌లపై ర్యాలీగా బసవతారకం దవాఖాన సర్కిల్ వరకు చేరుకొని.. అక్కడి నుంచి సాయంత్రం 4 గంటల సమయంలో పాదయాత్రగా తెలంగాణ భవన్‌కు చేరుకుంటారు. తెలంగాణ భవన్‌లో దీక్షా దివస్‌ను ఘనంగా నిర్వహించనున్నారు. బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తలసాని పిలుపునిచ్చారు.

- సిటీబ్యూరో, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ):

కేసీఆర్ త్యాగ ఫలితం వల్లే తెలంగాణ రాష్ట్రం..

ఎన్నో త్యాగాల పునాదులపై బీఆర్ఎస్ జెండా ఎగిరింది. కేసీఆర్ చేసిన త్యాగ ఫలితం వల్లే తెలంగాణ రాష్ట్రం సిద్ధించింది. కంటోన్మెంట్‌లో చేపట్టే దీక్షా దివస్‌ను శ్రేణులు విజయవంతం చేయాలి.

- టీఎస్ శ్రీనివాస్, మాజీ చైర్మన్, బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ

తెలంగాణ మలిదశ పోరాటానికి..

తెలంగాణ మలిదశ పోరాటానికి కేసీఆర్ చేపట్టిన దీక్షే కారణం. తెలంగాణ ఉద్యమం కోసం కేసీఆర్ తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా దీక్షకు పూనుకున్నారు. దీక్షాదివస్ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు తరలిరావాలి.

- జక్కుల మహేశ్వర్‌రెడ్డి, మాజీ ఉపాధ్యక్షుడు, కంటోన్మెంట్ బోర్డు

ఉద్యమంలో కంటోన్మెంట్‌ది ప్రత్యేక పాత్ర..

నాడు ఉద్యమానికి కేంద్ర బిందువుగా కంటోన్మెంట్ స్వరాష్ట్ర సాధనలో ప్రత్యేక పాత్ర పోషించింది. నాటి ఉద్యమ సహచరుల కృషి మరవలేనిది. దీక్షా దివస్ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున కంటోన్మెంట్‌లో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. నేడు కంటోన్మెంట్ నుంచి తెలంగాణ భవన్ వరకు సుమారు 300 వాహనాలతో భారీగా తరలివెళ్లనున్నాం.

- గజ్జెల నాగేశ్, మాజీ చైర్మన్, రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్

మహనీయుడు కేసీఆర్

14 ఏండ్లు పోరాటం చేసి తెలంగాణ తెచ్చిన మహనీయుడు కేసీఆర్. ఉద్యమ చరిత్రలో కేసీఆర్ పోరాటం, ఆయన దీక్ష చెరగని ముద్ర వేసింది. ఆ దీక్ష ను మరోసారి మననం చేసుకుందాం.

- మన్నె క్రిశాంక్, మాజీ చైర్మన్, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ

పేద వైద్య విద్యార్థుల సంక్షేమానికి బీఎల్ఆర్ కృషి అభినందనీయం

హిందుపురం ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ

పేద వైద్య విద్యార్థులకు చెక్కులను అందజేస్తున్న హిందుపురం ఎమ్మెల్యే, ప్రముఖ సినీ నటుడు నందమూరి బాలకృష్ణ, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

చర్లపల్లి, నవంబర్ 28: పేద వైద్య విద్యార్థుల సంక్షేమానికి బీఎల్ఆర్ ట్రస్ట్ కృషి హర్షనీయమని హిందుపురం ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ పేర్కొన్నారు. కాప్రా సర్కిల్, నాచారం డివిజన్ పరిధిలోని హైపర్ మార్ట్ ప్రారంభోత్సవంలో నందమూరి బాలకృష్ణ, బీఎల్ఆర్ ట్రస్ట్ చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నలుగురు పేద వైద్య విద్యార్థుల చదువుల నిమిత్తం బీఎల్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఫీజులకు సంబంధించిన చెక్కులను అందజేశారు. అనంతరం బాలకృష్ణ మాట్లాడుతూ, పేద వైద్య విద్యార్థులకు ఫీజులను మొత్తం బీఎల్ఆర్ ట్రస్ట్ చెల్లించడం అభినందనీయమని, వైద్య విద్యార్థులకు బాసటగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి నిలబడటం హర్షనీయమన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలను వేగవంతం చేయాలని ఆయన సూచించారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలోని పేద విద్యార్థులకు బీఎల్ఆర్ ట్రస్ట్ ద్వారా సౌకర్యాలు కల్పిస్తున్నామని, ప్రధానంగా వైద్య విద్యార్థులకు బీఎల్ఆర్ ట్రస్ట్ ఫీజులను చెల్లిస్తుందన్నారు. అదే విధంగా విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఉపాధి శిక్షణ తరగతులను గతంలో ఏర్పాటు చేసి ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. ఈ సందర్భంగా పేద విద్యార్థులను ఆదుకోవడంతో పాటు నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని నందమూరి బాలకృష్ణ అభినందించారు. కార్యక్రమంలో నాచారం, మల్లాపూర్ డివిజన్ల కార్పొరేటర్లు శాంతి సాయిజెన్ శేఖర్, పన్నాల దేవేందర్ రెడ్డి, నాయకులు ప్రవీణ్ ముదిరాజ్, సాయి జెన్ శేఖర్ పాల్గొన్నారు.

ఎట్టకేలకు బల్దియా బడ్జెట్ రెడీ!

రూ. 8600 కోట్లతో ప్రతిపాదన

రేపు స్టాండింగ్ కమిటీలో చర్చ

సిటీబ్యూరో, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ): ఎట్టకేలకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ ప్రతిపాదనతో జీహెచ్ఎంసీ సిద్ధమైంది. హౌసింగ్‌తో కలుపుకొని ఈ సారి రూ. 8,600 కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 30న ఈ బడ్జెట్ ప్రతిపాదనపై మేయర్ అధ్యక్షతన జరిగే స్టాండింగ్ కమిటీ సమావేశంలో సభ్యులు చర్చించి ఆమోదించే అవకాశాలున్నాయి. ఆ తర్వాత సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేసి ప్రభుత్వానికి అందజేయనున్నారు. కాగా, 2024-25 బడ్జెట్ రూ. 7,937 కోట్లు కాగా, ఈ సారి దాదాపు రూ. 570 కోట్ల మేర అదనంగా బడ్జెట్ పెంచారు.

డిసెంబర్ 15లోపు..: వాస్తవానికి అక్టోబర్‌లోనే బడ్జెట్‌కి సంబంధించిన ప్రక్రియ మొదలు పెట్టాల్సి ఉన్నప్పటికీ నవంబర్ నెలాఖరు వరకు సమయం తీసుకున్నారు. డిసెంబర్ 15వ తేదీలోపు వార్షిక బడ్జెట్ అంచనాలు స్టాండింగ్ కమిటీ ఆమోదించాలని బల్దియా చట్టం పేర్కొంటుంది. వచ్చే ఏడాది జనవరి 10వ తేదీలోపు జనరల్ బాడీ మీటింగ్‌లో సభ్యుల ముందు చర్చ పెట్టి ఆమోద ముద్ర పొందాల్సి ఉంటుంది. మార్పులు, చేర్పుల ఆనంతరం ఫిబ్రవరి 20లోపు అంచనాలను మంజూరు చేయాల్సి ఉంటుందని చట్టం చెబుతున్నది. మార్చి 1లోపు కార్పొరేషన్ బడ్జెట్ అంచనాల సమాచారాన్ని ప్రభుత్వానికి తెలియజేయాల్సి ఉంటుంది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు విరుద్ధంగా కనిపిస్తున్నాయి. నిర్ణీత సమయంలో బడ్జెట్ ప్రక్రియను ముగిస్తారా? లేదంటే మార్పులు, చేర్పులతో ప్రభుత్వానికి సకాలంలో పంపించక కాలాయాపన చేస్తారా? అన్నది వేచి చూడాలి.

రేవంత్‌రెడ్డి.. దేశంలోనే అట్టర్ ఫ్లాప్ సీఎం

అస్తవ్యస్థమైన పరిపాలనతో ప్రజలకు ఇబ్బందులు

భవిష్యత్ ఇచ్చిన మల్కాజిగిరి అభివృద్ధికి ఒక్క పైసా కేటాయించలేదు

ఫోర్త్ సిటీ పేరిట సీఎం కుటుంబసభ్యుల ఇన్‌సైడ్ ట్రేడింగ్

కాంగ్రెస్ హామీలు ప్రజలకు అందేవరకు పోరాడుతా

కేసీఆర్ అధికారంలో లేని లోటు స్పష్టంగా కనిపిస్తున్నది

'నమస్తే'తో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

'దేశంలోనే అట్టర్ ఫ్లాప్ సీఎం రేవంత్‌రెడ్డి.. హైదరాబాద్ నగర ప్రతిష్టను పూర్తిగా దిగజార్చారు.. ఫోర్త్ సిటీ పేరిట సీఎం కుటుంబసభ్యులు ఇన్‌సైడ్ ట్రేడింగ్ చేస్తున్నారు.. నగరంలో శాంతి భద్రతలు కంట్రోల్ తప్పాయి.. తాగు నీటికి కటకట ప్రారంభమైంది.. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నాయి.. హైదరాబాద్ నగరంపై సీఎంకు అవగాహన లేక.. పరిపాలన చేతకాకపోవడంతో నగర ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. భవిష్యత్ ఇచ్చిన మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి ఒక్క పైసా కేటాయించలేదు.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారంలో లేని లోటు ప్రజలకు స్పష్టంగా కనిపిస్తున్నది. రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో గెలిపించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కరానికి ఎల్లవేళాల కృషి చేస్తా' అని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. 'నమస్తే'తో ప్రత్యేకంగా మాట్లాడిన ఆయన.. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ప్రజలకు అందే వరకు పోరాడుతానని స్పష్టం చేశారు. ఇంకా ఏమన్నారంటే...

-మేడ్చల్, నవంబర్ 28(నమస్తే తెలంగాణ)

నగర ప్రతిష్ట పూర్తిగా దిగజారింది..

హైదరాబాద్ నగర ప్రతిష్టను పూర్తిగా దిగజార్చి దేశంలోనే అట్టర్ ఫ్లాప్ సీఎంగా రేవంత్‌రెడ్డి పేరు తెచ్చుకున్నారు. హైదరాబాద్ నగరంపై అవగాహన లేక పరిపాలన చేత కాకపోవడంతో నగరంలో శాంతి భద్రతలు అదుపు తప్పాయి. వేసవి కాలం ప్రారంభానికి ముందే తాగు నీటి ఇబ్బందులు ఏర్పడ్డాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు కలుగుతున్నాయి. మున్సిపల్ శాఖ సీఎం రేవంత్‌రెడ్డి వద్దే ఉన్నా.. నగర అభివృద్ధికి ఎలాంటి ప్రణాళికలు రూపొందించడం లేదు. కనీసం నగర అభివృద్ధిపై సమీక్షించిన దాఖాలాలు లేవు. ఇలా అయితే హైదరాబాద్ నగర అభివృద్ధి ఎలా సాధ్యమవుతుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన అభివృద్ధి పనులే ఇప్పటికీ జరుగుతున్నాయి. వాటికి నిధులు అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నది. దీంతో అభివృద్ధి పనులు పూర్తికావడం లేదు. మున్సిపల్ శాఖ మంత్రిగా కేటీఆర్ కొనసాగిన సమయంలో నగర అభివృద్ధికి ప్రణాళికల అమలుకు అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ హైదరాబాద్ నగరంలో నివసించే ప్రజలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు నిరంతరం శ్రమించేవారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కరానికి లింకేజీ రోడ్లు, ఫ్లై ఓవర్ల నిర్మాణాలు జరిగాయి. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వంలో అభివృద్ధి అనేది జాడకు కూడా కనిపించడంలేదు.

హైదరాబాద్ ప్రతిష్టను దిగజార్చారు

చేతి నిండా పని..కంటి నిండా నిద్ర..

కేసీఆర్ అధికారంలో లేని లోటు ప్రజలకు స్పష్టంగా కనిపిస్తున్నది. కేసీఆర్ సీఎం ఉన్నప్పుడు ఆయన తీసుకున్న నిర్ణయాలతో స్వర్ణయుగంలా ఉండేది. అన్ని వర్గాల ప్రజలకు చేతి నిండా పని, కడుపు నిండా తిండి, కంటి నిండా నిద్ర ఉండేది. ఇప్పుడేమో పనులు లేక వలసలు వెళ్లే పరిస్థితిని ప్రభుత్వం కల్పించింది. సీఎం రేవంత్ అసమర్థ పాలన వల్ల హైదరాబాద్‌కు పెట్టుబడులు రాక నూతన నిర్మాణాలు జరగాక పోవడ వల్ల రియల్ ఎస్టేట్ పూర్తిగా కుప్పకూలింది. ఈ క్రమంలో ప్రజలకు పనులు దొరకడం లేదు. హైదరాబాద్‌పై నిర్దిష్టమైన ప్రణాళిక సీఎం రేవంత్ చేయలేకపోవడం వల్లే హైదరాబాద్ నగరానికి ఇలాంటి పరిస్థితి వచ్చింది. కేసీఆర్ సీఎంగా కొనసాగిన సమయంలో చేసిన అభివృద్ధి , అందించిన పథకాలను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు.

ఇన్‌సైడ్ ట్రేడింగ్..

ఫోర్త్ సిటీ పేరిట సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఇన్‌సైడ్ ట్రేడింగ్‌కు పాల్పడుతున్నారు. సీఎం తన కుటుంబ సభ్యులు మాత్రమే బాగు పడేలా ఫోర్త్ సిటీ పేరిట రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటూ గ్రేటర్ హైదరాబాద్ అభివృద్ధిని పూర్తిగా విస్మరిస్తున్నారు.

6 వేల కోట్లతో అభివృద్ధి

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కుత్బుల్లాపూర్ నియోజకర్గాన్ని రూ. 6 వేల కోట్లతో అభివృద్ధి చేశా. అప్పటి సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ సహకారంతో నియోజవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రజలకు సౌకర్యాలు కల్పించినందునే నన్ను 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో నియోజకవర్గ ప్రజలు గెలిపించారు. చెరువుల సుందరీకరణ, పార్కుల అభివృద్ధి, సీసీ రోడ్లు, తారు రోడ్లు, మంచినీటి సౌకర్యం, అండర్‌గ్రౌండ్ డ్రేనేజీల నిర్మాణాలు చేయించా. నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటా.

ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదు..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు నియోజకవర్గానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదు. ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదు. ప్రజల సమస్యలు పరిష్కరించనట్లయితే ప్రజలతో కలిసి పోరాటాలు చేసేందుకు సిద్ధమవుతాం. గత ప్రభుత్వంలో మంజూరు చేసిన నిధులే సక్రమంగా ఇవ్వడం లేదు. కుత్బుల్లాపూర్ నియోజవర్గంలో లింకేజీ రోడ్లకు గత ప్రభుత్వ హయాంలో మంజూరైన నిధులను మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వంతో పోరాడి నిధులు రాబట్టా. లింకేజీ రోడ్లకు బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 70 కోట్లను మంజూరు ఇచ్చింది. ఇచ్చిన నిధులను రాబట్టేందుకే ప్రభుత్వంతో పోరాడాల్సి వచ్చింది. అలాగే కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో డిగ్రీ కళాశాల భవన నిర్మాణం ఏర్పాటుకు సంబంధించి భూ సేకరణ చేసేలా చర్యలు తీసుకుంటున్నా. బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన మెడికల్ కళాశాలకు భూ సేకరణ పనులను ప్రారంభించేలా అధికారులపై ఒత్తిడి తేస్తున్నా.

భవిష్యత్ ఇచ్చిన మల్కాజిగిరికే మొండిచెయ్యి

2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్ నియోజకవర్గ ప్రజలు రేవంత్‌రెడ్డిని తిరస్కరిస్తే మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు ఆదరించి ఎంపీగా చేస్తే మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గానికి ఇప్పటి వరకు ఒక్క పైసా మంజూరు చేసింది లేదు. సీఎం అయ్యేలా భవిష్యత్ ఇచ్చిన మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయిస్తే బావుంటుంది. నార్త్ సిటీ అభివృద్ధిని సీఎం రేవంత్‌రెడ్డి అడ్డుకుంటున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు మెట్రో ఏర్పాటును బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపాదిస్తే సీఎం రేవంత్‌రెడ్డి మెట్రో ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నారు. మెట్రోపై ఇటీవల జరిగిన అసెంబ్లీలో ప్రస్తావించిన ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోవడం లేదు. భవిష్యత్ ఇచ్చిన జిల్లా ప్రజలకు మాత్రం సీఎం మెండి చెయ్యి చూపిస్తున్నారు.

గ్యారెంటీలు అందేవరకు పోరాటం చేస్తా..

ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు కేసీఆర్ నేతృత్వంలో పోరాటం చేసేందుకు సిద్ధమవుతా. 100రోజుల్లో ఆరు గ్యారెంటీలు హామీ ఇచ్చి ఏడాది గడుస్తున్నా..మహిళలకు ఉచిత బస్సు తప్ప.. ఇంకా ఏ ఒక్క పథకాన్ని ప్రజలకు అందించలేదు. కాంగ్రెస్ ఇచ్చిన పథకాలపై ప్రజలు నమ్మకం కోల్పోతున్నారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చేలా కాంగ్రెస్ ప్రభుత్వం మేడలు వంచుతాం. రుణమాఫీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బౌరంపేట్ సహకారం సంఘంలో 632 మంది రైతులకు రుణమాఫీ చేయాల్సింది ఉంటే.. 11 మంది రైతులకు, దూలపల్లి సహకారం సంఘంలో 109 మంది రైతులుంటే 51 మందికి రుణమాఫీ చేసి మిగతా రైతులను మోసం చేశారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు.